# " **వినాయకుడు** -ఓం ఇతి ఏకాక్షరమ్ బ్రహ్మ "

'వినాయక చవితి 'ప్రతి సంవత్సరం కొంతమంది వితండ వాదులతో సంవాదానికి అవకాశం ఇస్తుంది .ఒక వితండ వాది వినాయకుడి తల ఏనుగు తల కదా ?,ఆ తల ఒక బాలుడి తలకు ఎలా సరిపోయింది ? అని అడిగాడు ఒక గ్రూపు లో ,ఇంకోకడు వినాయక రూపం బలవంతుడు బలహీనుడి ని ఎలా అణగత్రొక్కుతుందో చూపిస్తోంది అని ఎలుక మీద కూర్చొన్న వినాయకుడి  కార్టూన్ పంపించాడు .ఇంకొక డు, పండగ రోజు పాపం ఎందుకు ? అంటూ అసలు నిమజ్జనం చేయడం అవసరమా ? అని అసలు ఎక్కడా ఉపయోగపడని హుసేన్ సాగర్ జలాల చుట్టుపక్కల ఉన్న వ్యాపార సంస్థల నిరంతర  కాలుష్యం చూడకుండా అందరిని కలుపుతూ ,సమాజాన్ని ఐక్యంగా ఉంచుతున్న ఒక సామాజిక ఘట్టాన్ని ఆపేయడానికి అన్నీ జల కాలుష్య కారకాలను వినాయక నిమజ్జనానికి అంటగట్టేసి వ్యాసాలు రాసేస్తాడు ఇంకొకడు .

అసలు మన వాఙ్మయం లో వినాయకుడి పరిచయం మనం స్కూళ్ళలో సరిగా సిలబస్ లో చేర్చకపోవడం వల్ల కలిగిన సమస్య మనకు వితండ వాదాల తో వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మన జీవన  పద్ధతి లో వ్రతాలు ,యజ్ఞా లు,యాగాలు ,పండుగలు ,పూజలు ,షోడశ సంస్కారాలు ఇలా చాలా రకాల వ్యవహారాలు ఏర్పడ్డాయి . వినాయక చవితి ని వ్రతం పరిధి లో చేర్చారు ,వ్రతాలు సహజంగా వ్యక్తిగతంగా ,కుటుంబ పరంగా,సామాజికంగా ఒక అవసరం తో మనిషి మెలగడానికి ఒక కాల వ్యవధి లో  కొన్ని వ్రతాలు వ్యక్తిగతంగా నేర్చుకోవడానికి ,కొన్ని కుటుంబ పరంగా సరి అయిన సంవాదం కోసం లేదా  కుటుంబ నిర్వహణలో తెలుసుకోవాల్సిన పద్ధతుల నేర్పు కోసం ,కొన్ని వ్రతాలు సామాజిక దృక్పథం పెంచడం కోసం నిర్దేశించారు  .నేర్చుకొనే అవసరం ఉన్నవ్రతాలను  నోములని ,దీక్షలని ఒక పద్ధతి ఏర్పరిచారు .ఉదాహరణకి 'నందికేశుల నోము ','శ్రావణ మంగళ వారం ' నోములు క్రొత్తగా ఇంటి లో వచ్చిన కోడలికి రకరకాల వంటలు నేర్పించడానికి ,అలానే చూట్టూరా ఉన్న వాళ్ళతో పరిచయాలు చేయడానికి ,మాట్లాడే పద్ధతి నేర్పించడానికి ఒక ట్రైనింగ్ కోర్సుగా మనవాళ్లు ఏర్పాటు చేసినట్లు కాస్త పరిశీలిస్తే అర్థం అవుతుంది .

వినాయక వ్రతం సామాజిక అవసరంగా ఏర్పరిచారు . వ్యవసాయ ఆధారిత సమాజం లో ప్రకృతి ని ఒక సంకల్ప రూపం లో వర్షం పడ్డాక మొలకలెత్తే సమయం లో ,ప్రథమ పూజ వ్రతం రూపం లో ఏర్పాటు చేస్తూ ,చూట్టూరా గ్రామం లో ,ఇంటి కి దగ్గరగా అత్యంత విలువైన ఆరోగ్య మూలికలు గుర్తించడం,వాటి సంరక్షణ పట్టించుకోవడం ,క్రొత్తగా చెరువులో ,బావులలో చేరిన నీరు మూలికల తో(పత్రులతో ) పూజ చేసిన వినాయక ప్రతిమలతో నిమజ్జనం చేయడం ద్వారా క్రొత్తగా చేరిన నీటిని ఔషధ మూలికల  సహాయంతో నీటి ని వినియోగకరంగా మార్చడం  ,సామాజికంగా ప్రకృతి సంరక్షణ దీక్ష ను నేర్పించే క్రమం లో వినాయక వ్రతం ప్రతి ఒక్కరికి సామాజిక అవసరం లో పాలు పంచుకునేలా ఈ వ్రతాన్ని రూపొందించారు

వినాయకుడి రూపం అసలైన జీవ వైవిధ్యానికి ప్రతీక...

గజ ముఖం ,మానవ శరీరం ,ఎలుక వాహనం ,ఇరవై ఒక్క ఆకులతో పూజా,నీటిలో నిమజ్జనం ...

ప్రకృతి పరిరక్షణకు గణపతి ని మించిన ప్రేరణా సాధ్రుశ్యాన్ని ఆవిష్కరించగలమా?. ఆ పరమేశ్వరుడి ఇంట్లో

నెమలి,ఎలుకా,పాము,నంది,సింహం అనే వాహనాలతో ఒకటి కి మరోకటి శత్రువులైనా అన్నీ సమన్వయంతో కలసి ఉండెలా జీవ వైవిధ్యాన్ని కాపాడిన ఆ భోళా శంకరుడు నిజంగా వైవిధ్యానికి నాందీ ,ఆధారం ..ఎలుక పంట సంరక్షణ కు ఉపయోగం తెలిసిందే. ఏదైనా విషయం తెలుసుకోవడానికి మనకు మన ఆలోచనా స్థాయి ఆ విషయం అవగాహన చేసుకొనే దిశలో ఉండాలి ,అలానే ఆ విషయానికి దగ్గరగా ఉండాలి . విమానం ఆకాశం లో ఎగురుతూ ఉన్నప్పుడు మనకు చాలా చిన్నగా కనపడుతుంది ,అదే విమానం దగ్గరగా విమానాశ్రయం లో పెద్దగా కనపడుతుంది .వస్తువు పరిమాణం మన స్థితి , పరిధి ని బట్టి ఎలా మారుతుందో ,ఈ ప్రపంచ సృష్టి వివరణ మన వాఙ్మయం లో కూడా అర్థం చేసుకుసేవాడి ఆలోచనా స్థితి,పరిధి ని బట్టి మారుతూ ఉంటుంది .

మనం వినాయక కథ పరిశీలిస్తే, వినాయకుడు పార్వతి దేవి నలుగు పిండి తో నలుచుకొన్న వృధా అయిన పదార్థం తో తయారు చేసి, ప్రాణం పోసినట్లు చదువుతాము .ఒక ఉపయోగం లేని పదార్థం ,ప్రకృతి ఇచ్చిన కదలికతో పరమేశ్వరుని (పురుష-లయ కారకుడు ) అడ్డగించి పార్వతి దేవి (ప్రకృతి కారకం ) ఆ ఉపయోగం లేని పదార్థానికి జీవ రూపంగా (ఏనుగు తల ) మార్పు చెంది పంచ మహా భూతాల (గణాల ) ఆధిపత్యం వహించడం , ఒకసారి ఈ వివరణ శక్తి ఒక్కొక్క పదార్థ అమరిక లో జీవం నింపుతూ ఒక లయతో జరిగే మార్పు దృక్కోణం లో పరిశీలిస్తే ,మనకు జీవ పరిణామ క్రమం వివరణ లో వినాయక రూపం ,పుట్టుక ప్రతికలుగా వివరించినట్లు నిగూఢ భావన అర్థం అవుతుంది .శక్తి మార్పు కు కారకం శివుడు ,శక్తి మార్పు పురుష ప్రకృతి ని వేరు వేరు రూప పరిచయం చేస్తుంది (కాంతి వేరు వేరు రంగులుగా మారినట్లు ),పదార్థం కూడా తన గుణం ఒక్కొక్క పరిస్థితిలో ఒక్కొక్క అనుభవాన్ని ఇస్తుంది ,ఒక ఇసుక (సిలికాన్ ) సెమికండక్టర్ గా,కండక్టర్ గా ,కేవలం ఒక నిర్మాణ సామాగ్రిగా ఎలా మారుతుందో ,ఒక బంగారం రాక రకాల ఆభరణంగా ఎలా మారుతుందో అలాగే ఏక శక్తి రూపం కూడా ఆయా రూప విస్తారం లో కలిగే మార్పు క్రమం లో ప్రధానంగా ప్రకృతి కి కలిగే సమస్య మార్పు తరువాత మిగిలిపోయే శక్తి ,పదార్థాలు ,ఈ మిగులు శక్తి ,పదార్థాలు ఎంత స్థాయిలో ఉంటాయో దానిని బట్టే మార్పు యొక్క అస్తిత్వం ఉంటుంది . అందుకే ఈ శక్తి మార్పు పంచభూతాల ను అదుపులో ఉంచుకోవాలి . ఈ శక్తి మార్పు సమీకరణం మొదలు కు కారకం శివుడు అయితే ,ఆ మొదలు సమీకరణం వినాయకుడు మార్పు నిరాటంకంగా సాగిపోవడం అర్థం కావడానికి విఘ్న లను హరించే రూపంగా మనకు వాఙ్మయం లో పరిచయం చేశారు .

వినాయకుడికి రూప విన్యాస సృష్టి కి ఆది సమీకరణం కాబట్టి గురుత్వాకర్షణ కేంద్ర రూపం భూమి తత్వాన్ని పరిచయం చేసేలా లంబోదర రూపం ప్రవేశ పెట్టారు .ఈ వస్తువు కైనా గరిమనాభి పైన నే గురుత్వాకర్షణ బలం పని చేస్తుంది .అందుకే లంబోదర రూపం ఇచ్చారు. వినాయకుడి రూపం 'ఓంకార 'రూపంగా మన వాఙ్మయం ప్రతిపాదించింది .

ఓం ఆత్మ స్వరూపం మాండూక్యంలో ఓంకార విశేషాలను ప్రకటించే మంత్రముంది "ఓం ఇత్యేకాక్షరమ్ బ్రహ్మ " అంటూనే

"ఓం ఇత్యేతదక్షరమిదగ్ం సర్వం తస్యోప వ్యాఖ్యనం భూతం భవత్ భవిష్యదితి

**సర్వమ్ ఓంకార ఏవ యచ్చాన్యత్రికాలాతీతం తదప్యోంకార ఏవ"** అంటే సృష్టి ప్రారంభ నిశ్శబ్ద ,శబ్ద స్వరూపం "ఓంకారం "అని ఉపనిషత్తులు వివరిస్తున్నాయి . అన్నీ నక్షత్రాలు కేంద్రకం తమ శక్తి సంకుచితం అయిపోయి కృష్ణ బిలం గా ఉన్నప్పుడు కాలానికి అర్థం లేదు ,వేటికి అర్థం లేని విడగొట్టలేని శక్తి రూపం పంచమహాభుతాల సహాయంతో ఒక మార్పు పొరలు పొరలుగా సృష్టి మార్పు ప్రకటితం అయ్యే సమయం లో బ్రహ్మ రూపం మన పంచేంద్రియాల రూపం లో కేవలం శబ్ద గ్రహణం మాత్రమే సాధ్యం కాబట్టి శబ్ద రూప "ఓంకారం " ప్రారంభం గా సూత్రీకరించారు మన ఋషులు .సోఽహమే ఓంకారం, మన శ్వాసను జాగ్రత్తగా గమనిస్తే గాలి లోనికి పీల్చేటప్పుడు 'సో' అనే ధ్వని వస్తుంది. బయటకు వదులుతున్నప్పుడు 'హం' అనే ధ్వని ఉంటుంది. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలను కలిపివింటే "సోఽహం" అవుతుంది.

జాగ్రత్తగా తరచిచూస్తే ఈ పదంలోని స, హం తర్వాత ఓం అని మాత్రమే నిలిచివుంటుంది. అందుకే ధ్యానానికి ఓంకారమే మేలని, శ్వాసమీద ధ్యాస ఉంచి చూడండని యోగసాధనలో గురువులు నిర్దేశిస్తారు. ఈ సోఽహం గురించి ఉపనిషత్తులలో చాలా చోట్ల విశేష వివరణలు ఉన్నాయి.వినాయకుడి రూపం,పుట్టుక,వ్రత పద్ధతి అంతా కూడా పర్యావరణ పరిరక్షణ దృక్పథం లో ,జీవ వైవిధ్య పరిణామ క్రమం అర్థం చేసుకోవడం లో ఎంతో వైజ్ఞానికంగా ఉన్న విషయాలను మన చదువుల నుండి దూరం చేసి చేతనా ప్రపంచ పరిశీలన నుంచి మనల్ని దూరం చేయడం ప్రభుత్వాల అజ్ఞానమ్ అవుతుంది .

వినాయక రూపం లో సృష్టి ప్రారంభం లో ఉన్న కదలికలను వివరించడమే కాక ,స్థూల,సూక్ష్మ ,కనపడే కారణ ప్రపంచం స్థాయిలలో ప్రతి జీవ రూప శక్తి మార్పు కు ప్రారంభం చేసేటప్పుడు మార్పు శక్తి విన్యాసాల ధ్యానం (ఎరుక) తప్పకుండా జరిగే మార్పు ను సఫలీకృతం చేస్తుంది .అందుకే ఏ కార్య ప్రారంభమైనా శక్తి మార్పుకు సంకల్పం కాబట్టి మానసిక శాస్త్రం దృష్ట్యా కూడా వినాయక ధ్యానానికి ప్రాధాన్యత ఇచ్చి రకరకాల వాఙ్మయ సాహిత్యం వినాయకుడి నామాలతో కార్య ప్రారంభం ,సంకల్పం చేస్తున్నప్పుడు ఉండాల్సిన స్వభావాన్ని వివరించేలా వినాయక నామావళి మనకు అందించారు .

ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రతిదానికీ పేర్లు ఇస్తాము. కానీ ఇలా చేయడంలో, మనం కొన్నిసార్లు ఒక జీవి లేదా పద్ధతి / ప్రక్రియ యొక్క నిజమైన స్వభావాన్ని బలహీనపరుస్తాము లేదా సరళీకృతం చేస్తాము. “నామకరణం” ఏదో యొక్క స్వభావం గురించి మరింత, లోతైన ప్రశ్నలను అడగకుండా చేస్తుంది.భాష లో పదాలను మనం ఒక ఆలోచన రూపానికి బంధించడం కూడా మనిషి స్వయంగా తన పరిశీలనతో ఒక ఆవిష్కరణ చేసినట్లే .

ప్రాముఖ్యంగా ఉన్న వినాయక షోడశ నామావళి పరిశీలిస్తే ,ఒక మానసిక శాస్త్రవేత్త సలహా లా గా పని ప్రారంభానికి ముందు ఎవరైనా ఈ పేర్లు చదువుకొని ,ఆ లక్షణాల పరంగా ఆలోచిస్తే ఏ పని ఐనా తప్పకుండా విఘ్నాలు లేకుండా పూర్తి అవుతాయి

- పని ప్రారంభించేటపుడు సంకల్పంతో పాటు సుముఖంగా ఉండాలి ,అంటే పని జరుగుతుంది అనే సకారాత్మక దృక్పథం ఉండాలి (సుముఖ:)
- పని ప్రాంభమ్ లో “నేను ఒక్కడినే “అనే బేల భావన పోగొట్టే ఆలోచన చేయాలి ,ఒక్కడినైనా సరే (ఎక్లా ఛలో ,ఎక్లా ఛలో అనే భావన) అనే దృక్పథం తో పని ప్రారంభం చేయాలి (ఏకద అంతం -ఏకదంతమ్ ) అలాగే దంత ఆనగా దృ - దర్శయతి అనే అర్థం లో ఒకే చిత్తం కలిగిన వాడుగా ఉండమని కూడా ‘ఏకదంత ‘ కు అర్థం వస్తుంది .
- ఒక పర్వతం లా గట్టి సంకల్పం కలిగి రక్తం ఉప్పొంగేలా నిర్ణయం ఎరుపు వర్ణ రూపం తో సమాయత్తం కావాలి (కపిల:)
- సంకల్పం చేసిన పని కి సంభంధించిన అన్నీ విషయాలను ఏనుగు చెవుల లాగా విశాల దృక్పథం తో వినాలి (గజ కర్ణక ;)
- “లంబ ఉదరం “(పెద్ద కడుపు ) గురుత్వాకార్షణ పనిచేసే కేంద్రానికి చిహ్నం ,ఆకర్షణ బలాలు చాలా పనిచేస్తాయి పని ప్రారంభం లో ఆ బలాల కేంద్రాలను పెద్ద బరువు పెంచి విషయ భూమిక కు దగ్గరగా ఉంచమని సూచిస్తోంది లంబోదర నామం .
- విఘ్నరాజ :,విఘ్నమ్ అంటే ఆటంకం ,పని ప్రారంభం లో ఆటంకాలు ఎక్కడో బయట నుంచి రావు ,మనమే వాటి పరిపాలకులం అని ఎరుకతో విఘ్నాలకు రాజుగా గుర్తెరిగి పని ప్రారంభించాలి అని అర్థం .

- గణాధిప : ప్రతి పనికి పని చేసే జట్టు కానీ,వనరులు కానీ ఏవి ఉన్నాయో వాటి వివరాల ఆలోచన చేసి (అధిప ) పని ప్రారంభించాలి
- ధూమకేతు : అగ్గి తో నిండిన జండా లేదా తోక చుక్క ను ధూమకేతు అని వ్యవహరిస్తారు,తోక చుక్క సంభావ్యత తో కూడిన అనిర్దిష్ట ఆటంకాలకు ప్రతీక ,అందుకే ప్రారంభించిన పని లో ఉన్న అనిర్దిష్ట అంశాలను కూడా ఆలోచించ మని సూచన ఈ పేరులో కనిపిస్తుంది (వర్షం పడటం,అగ్ని ప్రమాదాలు జరగడం ,భూకంపాలు రావడం లాంటి మన నియంత్రణలో లేని కారణాలను కూడా పని ప్రారంభం లో ఆలోచన చేయమని సూచన ఈ పేరులో కనిపిస్తోంది )
- గణాధ్యక్ష : గణాధిప అంటే నియంత్రణ లో ఉండటం అంటే గణాలను మానిటర్ చేసే పద్దతుల ను ఏర్పరుచుకోవడం ,ఇక్కడ గణ అధ్యక్ష అనడంతో ,గణాల ను (వనరులను ,జట్టును ) పని యొక్క అక్షం కేంద్రం గా అనగా లక్ష్యోన్ముఖం గా కదిలేలా చేయగలగడం,ఇలా పనికి సంభంధించిన వనరుల వినియోగం ఎక్కడ ,ఎప్పుడు చేయాలి అనే ఆలోచన కలిగి ఉండాలి అని ఈ నామం సూచిస్తోంది
- ఫాలచంద్ర : పని లో సఫలం కావాలంటే కోపిష్టి లక్షణాలు ప్రతికూల ఫలితాలు ఇస్తాయి ,అందుకే ఫాల భాగం అంటే నుదురు ,పని ప్రారంభం లో నుదురు చల్లగా ఉంచుకోవాలి అంటే ప్రశాంత చిత్తం తో పని మొదలెట్టాలి అని అర్థం .
- గజానన: : గజానన అంటే ఎనుగు లాగా పని వివరణ లో,నిర్వహణ లో స్థూల స్థాయిలో సూక్ష్మ విషయాలు కూడా పరిశీలించగల ఆలోచన చేయాలి
- వక్ర తుండ : వ + క్రతుమ్ + డ -వ అంటే ఇక్కడ ఒక పద్దతి ఏర్పరుచుకొని, క్రతుం అంటే పనిని ,డ కారం ముగింపు తెలిసి ఉండి అనే అర్థం వస్తుంది ,ప్రారంభించిన పని మొదలు,కార్య క్రమాను వ్యవహారము,ముగింపు తెలిసిఉండడం వక్రతుండ అవుతుంది.
- శూర్పకర్ణ : చిన్న చిన్న విషయాలను కూడా గమనించే లేదా వినే స్థాయి కలిగి ఉండడం
- హెరంభ: : మనం విజిగీషు ప్రవృత్తి అంటూ ఉంటాం ,హేరంబ పదం విజయం సాధించడమే దీక్షా గా కలిగిన వాడు ,లేదా గట్టి సంకల్ప బలం కలిగిన వాడు ,లేదా పట్టు పట్టువలయు బిగియ పట్టు అనే ఆలోచన కలిగి ఉండడం హేరంబ లక్షణం అవుతుంది .
- స్కంధపూర్వజ: స్కంధ పూర్వజ అంటే మామూలుగా కుమార స్వామి కి ముందు పుట్టినవాడు అనే ఒక అర్థం వస్తుంది ,అలానే స్కంధ అంటే ఒకటి గా చేరినది అని అర్దం,కార్యం యొక్క ఒక రూపాన్ని అసమగ్రం పూర్వ జ: లో జ: అంటే కలిగి ఉండడం ,పూర్వ అంటే కార్యం జరుగక ముందు ఆ కార్యం యొక్క ఏకరీతి రూపం కనుల ముందర ఆవిష్కారం కావడం స్కంద పూర్వజమ్ అవుతుంది .

ఇలా పదహారు ఆలోచనల దృక్పథం ధ్యానం (అవగాహన ) తో పని మొదలెడితే పని నిర్విఘ్నంగా ఎందుకు జరగదు? అందుకే వినాయకుడి రూపం,వ్రతం,పూజా,అన్నీ ఒక వైజ్ఞానిక ఆలోచనతో సామాజికంగా ,వ్యక్తిగతంగా ,సృష్టి అవగాహన పరంగా ఎప్పటికీ నిలిచి ఉండే ఒక అంశం ,అన్నింటికంటే ఇప్పుడు పర్యావరణ ,జీవ వైవిధ్యం,సమగ్ర అభివృద్ధి అనే విషయాల ప్రస్తావనలో ,మానసిక ఆలోచనా స్ఫూర్తి కేంద్రంగా వినాయక ఆధారిత వాఙ్మయం మానవ శ్రేయస్సుకు ఉపయోగపడుతోంది .